

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

05 ఆగస్టు 2025 పేజీలు : 08


దేశవ్యాప్తంగా 36 సెక్టార్ స్కిల్

## కౌన్సిల్‌ల ఏర్పాటు

ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) దేశంలో పరిశ్రమ సహాయంతో దాదాపు 40 సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లను ఏర్పాటు చేసిందనేది వాస్తవమా.. అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆరా తీశారు. సోమవారం లోక్‌సభలో ఈ మేరకు సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌ల ఏర్పాటుపై పలు ప్రశ్నలు వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా వారీగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌సీల వివరాలు కోరారు. వివిధ రంగాల శిక్షణ ప్రదాతలకు ఎన్ఎస్‌డీసీ ఇస్తున్న మద్దతు, రాష్ట్రంలోని సంబంధిత రంగాలకు అందించబడిన

-మిగతా 2లో



## మైనింగ్ వలయంలో.. చిక్కుకున్న జంగంరెడ్డిపల్లి

- పోలీస్ స్టేషన్లో విచారణకు హాజరైన టిడిపి నేత షేక్ పేరయ్యకు గుండెపోటు
- గ్రామం కోసం పోరాటం చేయటం నేరమా
- పోలీసులు తీరుపై ఆగ్రహించిన గ్రామస్తులు
- పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తులు బైఠాయింపు
- ఎస్ఐను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్

పోలీస్ స్టేషన్లో ఉద్రిక్త వాతావరణం

వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :

వరికుంటపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు షేక్ పేరయ్యకు స్థానిక పోలీస్‌స్టేషన్లో గుండెపోటుకి గురయ్యారు. వరికుంటపాడు మండలం భాస్కరాపురం రెవిన్యూ పరిధిలో జంగంరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న మైనింగ్ ప్రతిపాదనలను, వెంటనే నిలపాలని ఆ గ్రామ ప్రజలు గతవారం రోజులుగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నారు. అదే క్రమంలో శాంతియుతంగా నిరసనలు తెలియజేస్తూ.. వారి సమస్యను వ్యక్తపరిచే సమయంలో పోలీసులు జోక్యం చేసుకొని మైనింగ్ వ్యతిరేక కమిటీ సభ్యులను స్టేషన్‌కు

-మిగతా 2లో

ఏపీలో బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణకు తక్షణ

## చర్యలు అవసరం



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరంలో కాకినాడ నుండి తమిళనాడులోని చిదంబరం వరకు 420 కిలోమీటర్ల పాటు విస్తరించిన బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణపై రాజ్యసభలో గౌరవ సభ్యుడు బీద మస్తాన్‌రావు యాదవ్ గళమెత్తారు. 1806లో బ్రిటిష్ వారు నిర్మించిన ఈ కాలువ ఏటా వరదల నుంచి రక్షణ, సాగునీటి సరఫరా, ఉప్పు, అరణ్య ఉత్పత్తులు, బియ్యం వంటి వస్తువుల రవాణా వంటి అనేక అవసరాలను తీరుస్తూ శక్తివంతమైన జీవనరేఖగా నిలిచిందన్నారు.

-మిగతా 2లో

## రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్‌కు వైసీపీ నేతల విజ్ఞప్తి

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు.



06 పేజీలో

నవ్వినా.. చప్పట్లు కొట్టినా..

## కేసులా ?



- మాజీ మంత్రి అనిల్ స్పష్టం
- 6 గంటలపాటు అనిల్‌ను విచారించిన పోలీసులు

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న చేసిన అనుచిత వ్యాఖ్యలపై అనిల్‌కి నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సోమవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి సోమవారం 10 గంటలకు పోలీసుల ఎదుట హాజర య్యారు.

02

ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుపై..

## మరోసారి చర్చ

- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి
- త్వరితగతిన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వెల్లడి



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

నెల్లూరులో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటును వేగవంతం చేసేలా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయని, ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్‌ని కలిసిన ఎంపీ వేమిరెడ్డి.. సోమవారం పార్లమెంట్ భవనంలోకి కేంద్ర మంత్రి కార్యాలయంలో మన్‌సుఖ్ మాండవీయతో భేటీ అయ్యారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుతో కలిసి కేంద్ర మంత్రి కార్యాలయానికి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి.. ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుపై

-మిగతా 2లో

## కాకాణి పోలీసు కస్టడీ విచారణ పూర్తి

జైలుకు తరలింపు

వెంకటాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో తహసిల్దార్ సంతకాలు ఫోర్జరీ చేసి భూములు స్వాహా చేశారనే నేరంలో 14వ నిందితుడైన కాకాణి గోవర్ధన్ రెడ్డి 2 రోజుల పోలీస్ కస్టడీ విచారణ సోమవారం ముగిసింది.





వివరాలు 2లో

## ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుపై మరోసారి చర్చ

*(మొదటి పేజీ తరువాయి)*

సుదీర్ఘంగా చర్చించారు. హాస్పిటల్ ఏర్పాటుకు సంబంధించి అన్ని అంశాలను వివరించారు. ఇప్పటికే స్థల పరిశీలన పూర్తయినట్లు పేర్కొన్నారు. సిబ్బంది క్వార్టర్స్ కు కూడా స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ మేరకు త్వరితగతిన హాస్పిటల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దాంతో సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి.. నెల్లూరులో హాస్పిటల్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఐఐటీ క్యాంపస్‌ను సందర్శించిన వీబీఆర్

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నారాయణలో చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందిపుచ్చుకోవడమే లక్ష్యంగా వారిని తీర్చిదిద్దాలని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సూచించారు. సోమవారం నగరంలోని అరవింద నగర్ ఐఐటి క్యాంపస్‌ను ఆయన సందర్శించారు. క్యాంపస్‌లోని తరగతి గదులను, వివిధ విభాగాల ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఏజీఎం, ఏవో తదితరులతో సమావేశమయ్యారు. ఈ ఏడాది ఐఐటీ, జేఈఈ మెయిన్స్ లో మంచి ఫలితాలు సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు నారాయణా విద్యాసంస్థల విద్యార్థులు అన్ని పోటీ పరీక్షల్లో ముందంజలో ఉన్నారని మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించేందుకు కష్టపడి పని చేయాలని సిబ్బందికి తెలియజేశారు.






# నవ్వినా.. చప్పట్లు కొట్టినా.. కేసులా ?

### మాజీ మంత్రి అనిల్ స్పష్టం - 6 గంటలపాటు అనిల్‌ను విచారించిన పోలీసులు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న చేసిన అనుచిత వ్యాఖ్యలపై అనిల్‌కి నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సోమవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి సోమవారం 10 గంటలకు పోలీసుల ఎదుట హాజరయ్యారు. అందులో భాగంగా మాజీ మంత్రి అనిల్‌ను సుమారు 6 గంటల పాటు విచారించారు. మొత్తం 36 ప్రశ్నలను పోలీస్ అధికారులు అనిల్ కుమార్ యాదవ్‌ను ప్రశ్నించారు. సుమారు 6 గంటలకు సేపు పోలీస్ అధికారులు ప్రశ్నించడంతో వైసీపీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అనిల్ కుమార్ యాదవ్‌ను అరెస్టు చేస్తారని.. కొన్ని రోజుల నుంచి పుకార్లు రావడంతో, రూరల్ డీఎస్పీ కార్యాలయానికి భారీస్థాయిలో వైసీపీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన విచారణ అరగంట లోపలే పూర్తయింది. అయితే వైసీపీ కార్యకర్తల అలజడి వల్ల విచారణ పూర్తయినప్పటికీ 6 గంటల దాకా డీఎస్పీ కార్యాలయంలోనే ఉంచారు. దీంతో డీఎస్పీ కార్యాలయం వద్ద సాయంత్రానికి కార్యకర్తల అలజడి తగ్గడంతో అనిల్‌కుమార్‌యాదవ్‌ను సాయంత్రం 4 గంటలకు విచారణ పూర్తయిందని, ఇక మీరు వెళ్లవచ్చని పోలీస్ అధికారులు చెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశాంతి రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు 2 రోజుల తర్వాత ప్రసన్నతోపాటు మరో ఐదు మందిపై కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. ప్రసన్న వ్యాఖ్యలు చేస్తే, తాము నవ్వామని కేసులు పెట్టారని చెప్పారు. వేదికపై ఎవరు మాట్లాడినా.. వేదికపైన ఉన్నవారిపై కేసులు పెడతారని తనకు ఇప్పుడే తెలిసిందన్నారు. ఇకపై వేదిక కూడా ఎక్కకూడదనేలా చేస్తున్నారని పేర్కొన్నారు. నవ్వినా, చప్పట్లు కొట్టినా తప్పే అని ప్రభుత్వం అనటం దారుణంగా ఉందన్నారు. వైసిపి నాయకులపై అనవసరపు కేసులు పెట్టి కూటమి ప్రభుత్వం శునకానందం పొందుతున్నారన్నారు. మరోసారి ప్రభుత్వం వస్తే కూర్చున్నా.. నిల్చున్నా కేసులు పెడుతారేమో అని తెలిపారు. పోలీసులు మొత్తం 36 ప్రశ్నలు అడిగారని వాటికి రాతపూర్వకంగా సమాధానం చెప్పినట్లు వివరించారు. ప్రసన్నని 3 గంటలు కూర్చో పెట్టి, నన్ను 6 గంటలు కూర్చోపెట్టారా అని అన్నారు. ప్రసన్న మాట్లాడిన మాటలు ఏ ఉద్దేశంతో మాట్లాడారో తనకు తెలియదన్నారు.

## మైనింగ్ వలయంలో చిక్కుకున్న జంగంరెడ్డిపల్లి

*(మొదటి పేజీ తరువాయి)*

పిలిపించి వారిని విచారించే క్రమంలో జేఏసీ కమిటీ సభ్యుడైన పీరయ్యకు స్థానిక ఎస్ఐ రఘునాథ్ స్టేషన్‌కు హాజరు కావాలని పదే పదే ఫోన్లు చేయటంతో షేక్. పీరయ్య ఒత్తిడికి లోనయ్యాడు. సోమవారం తెల్లవారుజామున షేక్.పీరయ్య ఇంటి వద్దకు చేరుకున్న పోలీసులు తనని 'టీ' తాగనివ్వకుండా, మలవిసర్జనకు కూడా వెళ్ళనీయకుండా పోలీసులు పేరయ్యను బలవంతంగా స్టేషన్‌కి తరలించారు. పోలీస్ స్టేషన్లో ఎస్ఐ రఘునాథ్ బలవంతపు విచారణ చేస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో స్టేషన్‌లోనే కుప్పకూలిపోయాడు. వెంటనే జేఏసీ సభ్యులు, గ్రామస్తులు చికిత్స కోసం పామూరు హాస్పిటల్‌కి తరలించగా, పరిస్థితి విషమించడంతో అక్కడ నుండి విజయవాడ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రామాలయం మందిరంలో పేరయ్య క్షేమంగా తిరిగి రావాలని పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే ఉండి పోలీస్ స్టేషన్ ముట్టడించి రాస్తారోకో నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పోలీసులు, గ్రామస్తులను మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పీరయ్య క్షేమంగా తిరిగి వచ్చేంత వరకు గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి, రాస్తారోకో నిర్వహించారు. 144 సెక్షన్ అమలులో ఉందంటూ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో గ్రామస్తులకు పోలీసులకు మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉదయగిరి సిఐ మాట్లాడుతూ.. మైనింగ్ సమస్య మా పరిధిలో లేదని ఉన్నతాధికారులతో మాట్లాడుకోండి, రాస్తారోకోలు, హైవే దిగ్బంధాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గొప్ప ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతును వినడం అవసరమని, ప్రజల అభిప్రాయాల్ని తెలియజేసే నాయకులను అనవసరమైన మానసిక ఒత్తిడికి గురిచేయడం బాధాకరమని పేర్కొన్నారు. న్యాయం కోసం పోరాడుతుంటే కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తారా.. అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పోలీసు వ్యవస్థ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆకాంక్షించారు. వెంటనే సంబంధిత అధికారులు ఎస్ఐ రఘునాథ్ సస్పెండ్ చేయాలని గ్రామస్తుల డిమాండ్ చేశారు. అనంతరం జోరు వానలో తహసిల్దార్ కార్యాలయాన్ని జేఏసీ నాయకులు, గ్రామస్తులు ముట్టడించారు. మైనింగ్ వద్దు.. గ్రామం ముద్దు.. అంటూ గ్రామస్తులు నినాదాలు చేశారు. మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని తహసిల్దార్ హేమంత్ కుమార్‌ని కోరగా.. ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.



## కాకాణి పోలీసు కస్టడీ విచారణ పూర్తి

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో తహసిల్దార్ సంతకాలు ఫోర్జరీ చేసి భూములు స్వాహా చేశారనే నేరంలో 14వ నిందితుడైన కాకాణి గోవర్ధన్ రెడ్డి 2 రోజుల పోలీస్ కస్టడీ విచారణ సోమవారం ముగిసింది. నెల్లూరు రెండవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు ప్రకారం గోవర్ధన్ రెడ్డిని వర్చువల్ విధానం ద్వారా సీఐడీ పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఉత్తర్వుల ప్రకారం సీఐడీ పోలీసులు జిల్లా జైలుకు తరలించారు. ముందుగా సీఐడీ పోలీసులు రెండవ రోజు విచారణలో భాగంగా కోర్టు ఉత్తర్వులు అనుసరించి గోవర్ధన్ రెడ్డిని జిల్లా జైలు నుంచి సమీప పోలీసు శిక్షణ కేంద్రానికి సోమవారం తరలించారు. అక్కడ సీఐడీ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు కేసులో 12 ప్రశ్నలు వేసి విచారణ చేశారు. సర్వేపల్లి బిట్ వీఆర్‌ఓ చల్లా సూర్య కుమార్, వెంకటాచలం మండలం చవటపాలెం వీఆర్వో వేములచెడు సాంబశివ సమక్షంలో కాకాని గోవర్ధన్ రెడ్డిని సీఐడీ పోలీసులు విచారించారు. సాయంత్రం 5 గంటల దాకా విచారణ చేసిన సీఐడీ పోలీసులు కోర్టు ఉత్తర్వుల అనుసరించి ఆయనను జిల్లా జైలుకు తరలించారు. దీంతో ఈ కేసులో కోర్టు అనుమతి ఇచ్చిన రెండు రోజుల పోలీస్ కస్టడీ విచారణ ముగిసింది.

## దేశవ్యాప్తంగా 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌ల ఏర్పాటు

*(మొదటి పేజీ తరువాయి)*

సహాయం వివరాలు ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ) ఆధ్వర్యంలో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ).. దేశవ్యాప్తంగా 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లను (ఎస్ఎస్‌సీ) ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఎస్ఎస్‌సీలు సంబంధిత రంగాల నైపుణ్యాభివృద్ధి అవసరాలను గుర్తించడంతోపాటు నైపుణ్య సామర్థ్య ప్రమాణాలను నిర్ణయించడం తప్పనిసరి. ఎస్ఎస్‌సీలు ఎప్పటికప్పుడు నైపుణ్య అంతరాల అధ్యయనాలను నిర్వహిస్తాయని, అవసరమైన నైపుణ్యాలపై సమాచారాన్ని అందిస్తాయన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శ్రామిక శక్తిని సిద్ధం చేసే క్రమంలో ప్రభుత్వానికి ఈ అధ్యయనాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఎస్ఎస్‌సీలు దేశవ్యాప్తంగా పని చేస్తాయని, ఫర్నిచర్ అండ్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్, ఐటీ-ఐటీస్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, టెలికాం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ అనే 4 ఎస్ఎస్‌సీలు తమ ప్రతినిధులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నియమించి పనిచేయిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో ఎస్ఎస్‌సీలు నైపుణ్య అంతర అధ్యయనాలు చేశాయని వివరించారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) స్కిల్ ఇండియా మిషన్ కింద అక్రిడిటేషన్, సామర్థ్యం పెంపు, ఫెసిలిటేషన్ సెంటర్ వంటి మద్దతును అందిస్తుంది. ఇందులో స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ (సిద్ధ్) ద్వారా శిక్షణ మౌలిక సదుపాయాలు, డిజిటల్ సాధనాల వినియోగం, నేషనల్ ఆక్యుపేషనల్ స్టాండర్డ్స్ (ఎన్ఓఎస్)తో పాఠ్యాంశాల అమరిక, ప్లేస్‌మెంట్ లింకేజీలు వంటివి ఉన్నాయన్నారు. ఎన్ఎస్‌డీసీ.. ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ, నిర్మాణం, లాజిస్టిక్స్, రిటైల్ వంటి రంగాల్లో భాగస్వామ్యం కలిగి ఉందని సమాధానం ఇచ్చారు.

## ఏపీలో బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణకు తక్షణ చర్యలు అవసరం

అయితే రైల్వే, రోడ్డు మార్గాలు అభివృద్ధి చెందడంతో కాలువ వినియోగం తగ్గిపోయింది. ఇప్పుడు ఈ కాలువ పూడిపోవడం, పరిశ్రమల మాలిన్యాలు, అక్రమ నిర్మాణాలు, వానాకాలపు నీటి కొరతల వల్ల నష్టపోయి ఖాళీ డ్రెయిన్‌లా మారిపోయిందని, ఇది జాతీయ జలమార్గం-4లో భాగంగా గుర్తింపు పొందినప్పటికీ, దీనిని పునరుద్ధరించే దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. స్వతంత్ర అధ్యయన నివేదిక ప్రకారం (డీపీఆర్), ఈ కాలువ ద్వారా 2047 నాటికి 7.14 మిలియన్ టన్నుల సరుకులు రవాణా చేయవచ్చని, మొదటి దశలో ఆర్థిక అంతర్గత రాబడి 22.84 శాతం కాగా, సంపూర్ణ రూపంలో ఇది 34.27 శాతానికి పెరుగుతుందన్నారు. ఇది నోటీసబుల్ లాజిస్టిక్స్ లాభాలు, వ్యవసాయ వినియోగదారుల కోసం ఖర్చుల తగ్గింపు, ఉద్యోగ అవకాశాలు, పర్యావరణ పునరుద్ధరణకు దోహదం చేస్తుందని బీద మస్తాన్ రావు యాదవ్ తెలిపారు. ఈ నేపథ్యంలో జాతీయ జలమార్గం-4లో భాగంగా చరిత్రకు మిగిలిన ఈ జీవన నదిని పునరుజ్జీవించాలి. ఆంధ్రప్రదేశ్‌లో బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణకు తక్షణ నిధుల మంజూరు.. బకింగ్ హెూమ్ కాలువ ప్రత్యేక ప్రాధికార సంస్థ ఏర్పాటు, అమృత్ సరోవర్ మిషన్, కోస్టల్ షిప్పింగ్ బిల్-2025తో అనుసంధానం, స్థానిక రైతులు, మత్స్యకారులు, ఉప్పు కార్మికుల చురుకైన భాగస్వామ్యం.. ఈ కాలువను చరిత్రలో ఓ పేజీగా కాకుండా, అభివృద్ధి మార్గంగా మలచుకోవాలని బీద మస్తాన్ రావు యాదవ్ పిలుపునిచ్చారు.

# అప్పారావుపాళెం దేవాలయ అభివృద్ధికి 5లక్షల నిధులు

## మంజూరు పత్రాలు పంపిణీ : మంత్రి ఆనంకు కృతజ్ఞతలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం గ్రామంలో ఒక దేవాలయానికి అభివృద్ధికిగాను 5లక్షల రూపాయల నిధులు, ఆలయ అర్చకునికి నెలరివేతనం 10వేల రూపాయలను రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రభుత్వం నుండి మంజూరు చేయించారు. ఈ మంజూరు పత్రాలను సోమవారం ఆత్మకూరుపట్టణంలోని తెలుగుదేశం కార్యాలయంలో అప్పారావుపాళెం మాజీ సర్పంచ్ ధన్యాసి రమణమ్మ, టిడిపి నాయకుడు చంద్రా శ్రీనివాసులు నాయుడులకు మండల సీనియర్ టిడిపి నాయకుడు కేతా విజయభాస్కరరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు సుంకరపెంచలచౌదరిలు అందజేశారు. రమణమ్మ, శ్రీనివాసులు నాయుడు ఎంతో సంతోషం వ్యక్తం చేసి మంజూరుచేయించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, కృషిచేసిన మండల నాయకులు కేతా విజయ భాస్కరరెడ్డి, సుంకర పెంచలచౌదరిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా విజయభాస్కరరెడ్డి, పెంచలచౌదరిలు మాట్లాడుతూ ఏయి పర్యవేక్షణలో ఆలయాన్ని ఈ నిధులతో మరమ్మత్తులు చేయించుకోవాలని, నాణ్యతగా పనులు చేయించుకోవాలని సూచించారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ప్రభుత్వ సంక్షేమకార్యక్రమాలన్నింలటిని అమలుచేస్తూనే అనూహ్యంగా నిధులు సాధించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, మెగా జాబ్‌మేళా జిల్లాలోనే ఎన్నడూలేని విధంగా నిర్వహించి 1200 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. తాజాగా ఆత్మకూరు పట్టణంలో 10, మండలంలో 20దేవాలయాల అభివృద్ధికి 150లక్షల రూపాయలు మంజూరు చేయించారని వారు తెలిపారు. మంత్రి ఆనం సారధ్యంలో ఆత్మకూరు నియోజకవర్గం అన్నిరంగాల్లో శరవేగంగా అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందని కేతా, సుంకర పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తెలుగురైతు జిల్లా నాయకుడు మద్దినేని నారాయణ, తెలుగుదేశం నాయకులు గోగిరెడ్డి పెంచలరెడ్డి, అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పాతవెల్లంటిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పాతవెల్లంటి గ్రామం అరుంధతి వాడలో 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఒకటికి మూడుసార్లు ఏకధాటిగా నన్ను భారీ మెజారిటీతో గెలిపించి, కుటుంబ సభ్యుడిగా ఆదరించారని తెలియజేశారు. అలాగే నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పట్ల నాకు, నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి ఎప్పుడూ విశ్వాసం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఎన్నికలు ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజలమధ్యనే నేను, నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఉంటామని తెలియజేశారు. అనంతరం నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ఏ పని అడిగిన వెంటనే అనుమతులు ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలపక్షాన ధన్యవాదాలు తెలియజేవారు. అలాగే పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పమజుల ప్రదీప్, స్థానిక సర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుదాం

## చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆగస్టు 7వ తేదీ జరగబోయే 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం చేనేత జోళి శాఖ కార్యాలయంలో జిల్లా చేనేత కార్యాలయం ఏడీతో జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు సమావేశమై జాతీయ చేనేత దినోత్సవం ఎలా జరుపుకుందాం అనేదానిమీద సుదీర్ఘంగా చర్చించి జిల్లాలో ఉండే చేనేత కార్మికులనందరిను ఆగస్టు 7వ తేదీ ఉదయం ఏడు గంటలకల్లా గాంధీ బొమ్మ వద్దకు చేరుకుని మహాత్మా గాంధీకి నివాళులర్పించి అక్కడి నుండి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని అక్కడ ఆప్కో వారు ఒక స్టాల్ ఏర్పాటు చేస్తారు దానిని సందర్శించి తదుపరి తిక్కన్న భవన్లో సభ జరుపుదామని ఆ సభలో చేనేత రంగంలో దీర్ఘకాలికంగా పనిచేసిన నాయకులను కార్మికుల సన్మానిస్తాం అని చెప్పడం జరిగింది. ఈ సమావేశంలో ఏడి గారిని ఘనంగా సాలువాతో సన్మానించి చిలప నూలతో సత్కరించడం జరిగింది. ఈ యొక్క సమావేశంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ, పద్మశాలి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు చింతలపూడి పెంచలయ్య, గౌరవ అధ్యక్షులు గుత్తికొండ వెంకయ్య, నెల్లూరు పార్లమెంట్ చేనేతకో ఆర్డినేటర్ ఆశం సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు జానపాటి రామసబ్బయ్య, చేనేత ఐక కార్యాచరణ కమిటీ సభ్యులు దోనేపూడి కోటేశ్వరరావు, ఆకురాతి లక్ష్మీకాంతం, జానపాటి విజయ, కొప్పర్తి చంద్రశేఖర్ చేనేత నాయకులు పాల్గొన్నారు.

# మార్గదర్శకులుగా ముందుకురావడం సంతోషదాయకం : ఆర్డీఓ పావని



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గంలో మార్గదర్శకులుగా పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకురావడం అత్యంత సంతోష దాయకమని, అందరికీ స్ఫూర్తిదాయకమని ఆర్డీఓ పావని పేర్కొన్నారు. సీఎం రాష్ట్రంలో పి4 ద్వారా దాతలు నీరుపేద కుటుంబాలను దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మంత్రి ఆనం ఈ నియోజకవర్గంలో దాతలు స్వచ్ఛందంగా ముందు కొచ్చి మార్గదర్శకులుగా రావాలని పిలుపునిచ్చారు. దాంతో నియోజకవర్గవ్యాప్తంగా పలువురు దాత లు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా బాధ్యతలు స్వీక రించారు. సోమవారం ఆర్డీఓ పావని ఆధ్వర్యంలో ఆయా మండలాల తహశిల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈసందర్భంగా ఆర్డీవో పావని మాట్లాడుతూ.. మార్గదర్శకులుగా వచ్చిన వారు నిరుపేదకుటుంబాలను దత్తత తీసుకోనున్నారని, ఆయా కుటుంబాలను అన్నివిదాలా అభివృద్ధి పరిచేలా కృషి చేస్తారని పేర్కొన్నారు. అనంతరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. పి4 కార్యక్రమం మంచిదని, పేదరిక నిర్మూలనకు దోహదపడుతుందని, సీఎం దూరాలోచన మేరకు రూపొందించారని, పేదకుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులు అక్ష్యంమేరకు తమవంతుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు తహశిల్దారు పి.పద్మజా కుమారి, ఎంపిడివో పి.రఫీఖాన్, అనంతసాగరం ఎంపిడివో పి.ఐజాక్ ప్రవీణ్, ఏఎస్‌పేట ఎంపిడివో పి.ప్రసన్నకుమారి, సంగం తహశిల్దారు బి.సోమ్లానాయక్, ఒపిడివోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను కాపాడండి : బీజేపీ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** భూగర్భ జలాలను కాపాడాలని భారతీయ జనతా పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తాసిల్దార్ స్వప్నకు వినతిపత్రం ఇచ్చారు. భూగర్భ జలాలు డీ బోర్లు మూలంగా ఉప్పు మయంగా ఉన్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వంలోని అధికారులు చక్కగా పనిచేశారని భాజపా అసంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో బిజెపి నాయకులు సంపత్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు

# యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వింజమూరు వ్యవసాయ శాఖసహాయ సంచాలకులు శేషగిరి డీలర్లను హెచ్చరించారు. సోమవారం జలదంకి మండలంలోని డీలర్లతో జలదంకిలోని రైతుసేవ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. యూరియా కానీ ఇతర ఎరువుల సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకొని రావాల్సిందిగా డీలర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జలదంకి మండలం వ్యవసాయాధికారిణి శ్రీవాణి, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.


# 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు జరుగుతున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం రాజేందర్ నగర్ అంగనవాడి కేంద్రంలో నెల్లూరు సిడిపిఓ టి.అరుణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు సిడిపిఓ టి.అరుణ మాట్లాడుతూ.. తల్లిపాలు పిల్లల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని, తల్లిపాలను కనీసం 6 నెలల పాటు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఈ చర్యల వలన తల్లి బిడ్డ అనుబంధం ఎక్కువగా ఉంటుంది. అదే రీతిగా తల్లిపాలు నివ్వడం వలన తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా, తల్లి బిడ్డల యొక్క అనుబంధం పెరుగుతుంది. ఒకరి పట్ల ఒకరికి ప్రేమానురాగాలు బ్రెస్ట్ ఫీడింగ్ వల్ల వస్తుంది ఈ చర్యలు శిశువుల ఎదుగుదలలో కీలకమైన పాత్ర పోషిస్తాయని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఇది పునాది కాబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పి.రామకృష్ణ, ఇన్‌చార్జ్ డాక్టర్ డి.గణేష్, హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జునైడ్ సిద్దికి, సిఓ టి.తిరుపతిమ్మ, సూపర్వైజర్ జి.కవిత, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 48 అర్జీలు

## డిప్యూటీ కమిషనర్ చెన్నుడు



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా అందుకున్న అర్జీలు అకౌంట్ సెక్షన్ 1, ఆప్కాస్ 3, ఇంజనీరింగ్ 6, టిడ్కో హౌసింగ్ 18, రెవెన్యూ 4, టౌన్ ప్లానింగ్ 8, పబ్లిక్ హెల్త్ 5, హెచ్ సెక్షన్ – 2, పెన్షన్ – 1, మొత్తం 48 అర్జీలను డిప్యూటీ కమిషనర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. నిర్దేశించిన సమయంలోపు సమస్యలన్నిటిని పరిష్కరించాలని విభాగాల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ హిమబిందు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వేణు, మురళి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘరానా స్మగ్లర్ అరెస్ట్



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** గత మూడు సంవత్సరముల నుంచి పోలీసుల కళ్ళు కప్పి తప్పించుకుని తిరుగుతున్న ఘరానా స్మగ్లర్‌ను చిన్న బజార్ పోలీసులు ప్రత్యేక బృందాలతో ఒడిష రాష్ట్రంలోని అటవీ ప్రాంతంలో అరెస్ట్ చేసి నెల్లూరుకు తీసుకు వచ్చినట్లు చిన్న బజార్ పోలీస్ స్టేషన్ సీఐ కోటేశ్వరరావు సోమవారం మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒడిషా రాష్ట్రంలోని అడవి ప్రాంతంలో నివాస ముండే జయదత్త బిశ్వాస్ అనే ముద్దాయి గంజాయిని అక్రమ రవాణాకు పాల్పడుతుండగా, 2022 సంవత్సరంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ వడిశెట్టి వెంకటేశ్వర్ రావుకు ఎన్‌డిపిఎస్ యాక్ట్‌లో పట్టుబడిన తెలిపారు. ముద్దాయి ఎస్బిబి 2 కానిస్టేబుల్‌ను తీవ్రంగా గాయపరిచి పోలీస్ కస్టడీ నుంచి తప్పించుకుని పారిపోయాడని. గత మూడు సంవత్సరాల నుంచి పోలీసుల కళ్ళు కప్పి తప్పించుకు తిరుగుతూ, రెండుసార్లు ప్రత్యేక బృందాలను పంపించి గాలించినప్పటికీ ఫలితం లేకపోగా చివరికి అదనపు ఎస్పీ సిహెచ్ సౌజన్య ఆదేశాల మేరకు నెల్లూరు టౌన్ డిఎస్పి సింధు ప్రియా సూచనలతో తమ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముద్దాయిని ఒడిష రాష్ట్ర అడవుల్లో తీవ్రంగా గాలించి అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. పోలీసుల కళ్ళుగప్పి గత మూడు సంవత్సరాలు తప్పించుకుని తిరుగుతున్న ముద్దాయిని చేకచక్యంగా ప్రవర్తించి (గ్రేవ్) అరెస్టు చేసిన చిన్న బజార్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సిహెచ్ కోటేశ్వరరావు, ప్రత్యేక బృంద సభ్యులు ఎస్ఐ అయ్యప్ప, పీసీ శ్యాంప్రసాద్, పీసీ సుబ్బారావు లను అదనపు ఎస్పీ, డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

### 'గార్లపాటి' ఔదార్యం.. పేదవిద్యార్థులకు

# కార్పోరేట్ విద్యాయోగం

- ప్రతిభావిద్యార్థులకు 83లక్షల స్కాలర్‌షిప్‌లు
- త్వరలో మరో ముగ్గురికి పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న దాత గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, ఫైల్‌ఫోటో

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం కరటంపాడుకుచెందిన మాజీ ఉపమండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి మెంబర్, గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, ఆయన సోదరులు ల్యాంకోగ్రూప్‌ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్, గార్లపాటి ఫౌండేషన్ చైర్మెన్ గార్లపాటి భాస్కరనాయుడు, ల్యాంకో చెన్నైశాఖ మేనేజర్ గార్లపాటి సుబ్బారావు సోదరుల ఔదార్యంతో అనేకమంది టెన్త్‌లో ప్రతిభ చూపే విద్యార్థులు కార్పోరేట్ కాలేజిల్లో విద్యాభ్యాసం గావించే మహత్తర అవకాశం లభిస్తోంది. ఈదపా టెన్త్ ఫలితాల్లో ప్రతిభచూపిన మరో ముగ్గురు విద్యార్థులకు కూడా త్వరలో పంపిణీ చేయనున్నారు. తమ స్వగ్రామమైన కరటంపాడులోని టిజెఎన్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2005 నుండి అక్కడ చదివే విద్యార్థులందరికీ యూనిఫారం దుస్తులు, నోటుపుస్తకాలు అందజేస్తుండడంతోపాటు టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు 1లక్షలరూపాయలవంతున స్కాలర్‌షిప్‌లు తమ ట్రస్ట్‌ద్వారా అందజేస్తూ వారు కార్పోరేట్ కాలేజిల్లో చదువకునే అవకాశం కల్పిస్తున్నారు. ఈస్కూల్లో ఆరుఅదనపు తరగతిగదులను, విశాలమైన స్టేజిని, ప్రహరీగోడ తదితరాలను నిర్మించారు. దాదాపు 2కోట్లరూపాయలకు పైగా ఈ పాఠశాలకు వారు వెచ్చించారు. కోట్లాదిరూపాయలతో వారు వివిద సామాజికసేవలందిస్తున్నారు. దాదాపు 28లక్షల వ్యయంతో గ్రామంలో శ్మశానాన్ని ఆధునీకరించారు. ఉర్దుపాఠశాల, పంచాయతీ కార్యాలయాలకు ప్రహరీగోడలు నిర్మించారు. వందలాదిమంది వికలాంగులకు కృత్రిమఅవయవాలు, ట్రైసైకిళ్ళు, వీల్‌చేర్స్, చేతికర్రలు, వినికిడి యంత్రాలు తదితరాలను తరచూ పంపిణీచేస్తుంటారు. వాటర్‌ప్లాంట్లు నిర్మించి ప్రజలకు ఉచితంగా పరిశుద్ధమైన త్రాగునీటిని సరఫరాచేస్తుంటారు. ఒక మొబైల్‌వాహనం ఏర్పాటుచేసి 12గ్రామాలకు తమ సిబ్బంది ద్వారా వైద్యసేవలందించారు. గ్రామంలో పారిశుధ్యమెరుగుకు 4.5లక్షల రూపాయల విలువగల ఒక ట్రాక్టర్‌ను కూడా ట్రస్ట్ ద్వారా అందజేశారు. తమ జన్మస్థలం, తాము కనీససౌకర్యాలు లేని రోజుల్లో తమ గ్రామంలోనే విద్యాభ్యాసంగావించిన ఉన్నత పాఠశాలకు తమవంతు సాయమందించాలని, విద్యార్థులకు చేయూతివ్వాలని, వారిని ప్రోత్సహించాలని, పేదా, ధనిక తేడాలేకుండా కార్పోరేట్ కాలేజిల్లో చదువుకునే అవకాశం కల్పించాలన్న లక్ష్యంగా తాము సేవలందిస్తున్నామని, జన్మనిచ్చిన గ్రామం, తమ నియోజకవర్గంలో తమవంతుగా సామాజికసేవలందించాలన్న లక్ష్యంగా, అందరికీ విద్య,వైద్యం, ఆరోగ్యం ఉండాలన్న ఆశయం, సంకల్పంతో తాము ఈ విధమైన సేవలందిస్తున్నామని, తాము ఉన్నతవిద్యఅభ్యశించి స్థితిమంతులమై స్థిరపడినందున ఈవిధమైన సేవలందించేలా కొనసాగుతున్నామని వేణుగోపాల్‌నాయుడు పేర్కొన్నారు.

## మాజీ మంత్రి అనిల్‌ని కలిసిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఇస్కాన్ సిటీలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ నివాసానికి వైఎస్‌ఆర్సిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ అండ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీ మేరీగ మురళీధర్, రూరల్ ఇంచార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జ్ కిలివేటి సంజీవయ్య, కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె కాకాణి పూజిత వైఎస్‌ఆర్సిపి ముఖ్య నాయకులతో కలిసి సోమవారం వెళ్ళి అనిల్ కుమార్ యాదవ్‌తో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుకు సంబంధించి అనిల్ కుమార్ యాదవ్ విచారణకు హాజరుకానున్న నేపథ్యంలో పలు అంశాలను నేతలు చర్చించారు.

## పాడి గేదెలపై పిచ్చికుక్క దాడి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని పడమటినాయుడుపల్లి గ్రామంలో సోమవారం తెల్లవారు జామున ఒక పిచ్చి కుక్క వీరంగం సృష్టించి సుమారుగా ఏడు పాడి గేదలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో ఆ పిచ్చి కుక్క వల్ల గ్రామంలో కలకలం రేపింది. ఈ విషయం తెలుసుకున్న ప్రజలు ఇళ్లలో నుంచి వచ్చేందుకు సాహసించ లేదు. ఇళ్ల తలుపులుమూసుకొని ఇళ్లలోనే ఉండిపోయారు. పిచ్చికుక్క మాత్రం స్వైర విహారం చేస్తూ ఎదురు పడిన పశువుల పై దాడికి పాల్పడింది. ఆపై వెంటనే గ్రామస్తులు పశు వైద్యాధికారులకు సమాచారం అందించడంతో మండల పశు వైద్యాధికారి జయచంద్ర వారి సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించి గాయపడిన పశువులకు వైద్యం అందించారు.

## నిమ్మ రైతులను పరామర్శించిన ప్రజాసంఘాలు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సోమవారం ప్రజా సంఘాలు కమ్మవారి పల్లి గ్రామంలోని నష్టపోయిన బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించి అనంతరం తొలగించిన నిమ్మ చెట్లను పరిశీలించారు. అనంతరం నెల్లూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ.. గద్దల తిప్ప వద్ద ప్రభుత్వ భూమిలో నిమ్మ చెట్లు సాగు చేసుకుంటున్న తురక మస్తాన్ కుటుంబాని వక్తిగతంగా తురక మస్తాన్‌పై కక్ష సాధింపుగానే నిమ్మ చెట్లను అధికారులపై ఒత్తిడి చేయించి తొలగించానని పల్లెటి వెంకటేశ్వర్ల నాయుడు బహిరంగంగా సోషల్ మీడియా ద్వారా వీడియోలలో హల్చల్ అవుతున్న కానీ అధికారులు పల్లెటి వెంకటేశ్వర్లు నాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడంపై ఆయన మండిపడ్డారు నష్టపోయిన బాధిత రైతులకు అధికారులు నష్టపరిహారం చెల్లించాలని అదే భూమిలో సాగుకు అవకాశం కల్పించాలని, అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి పేద ప్రజల నిమ్మ చెట్లను తొలగించిన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని మీడియా ముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాల్, వడ్డెర కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్ పంచేటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# తల్లి పాలు బిడ్డకు శ్రేష్టం : డాక్టర్ కిరణ్ రిషిత



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని, మరి ముఖ్యంగా తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడుతాయని డాక్టర్ కిరణ్ రిషిత అన్నారు. పొదలకూరు నరసారెడ్డి కాలనీ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. డాక్టర్ కిరణ్ రిషిత, ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ రిషిత మాట్లాడుతూ.. తల్లిపాల వారోత్సవాలను వారం రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాలు బిడ్డకు ఎంత అవసరమో తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం అని ఆమె చెప్పారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు తప్ప ఏ ఇతర ద్రవపదార్ధాలు తాగించకూడదని సూపర్వైజర్ జ్యోతి తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోనే తల్లియొక్క చిక్కటి పసుపు రంగు పాలు (ముర్రుపాలు) అమృతం లాంటివని ఆమె పేర్కొన్నారు. వీటి ద్వారా బిడ్డకు అతిముఖ్యమైన పోషకాలు లభిస్తాయని తెలిపారు. తల్లిపాలు బిడ్డ శరీరానికి, మెదడు కూడా పోషణను ఇస్తుందన్నారు. తల్లి పాలలో వున్న పోషక గుణాలు మరి ఏ ఇతర పాలల్లో వుండవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ జి.వరలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఎం.రాధా కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, మణెమ్మ, ఏవీ రత్నమ్మ, ఎంవి కుమారి, రమాదేవి, అమరావతి, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజలపై భారాలు మోపే విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలు తక్షణమే నిలుపుదల చేయాలని, పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నెల్లూరు సిటీ మినీ బైపాస్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం సెంటర్ నుండి ర్యాలీ మిలినియం విద్యుత్ సబ్ స్టేషన్ వరకు నిర్వహించడం జరిగింది అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ నాయకులు రామరాజు తదితర నాయకులు మీడియాతో మాట్లాడుతూ.. అదాని కంపెనీకి విద్యుత్ రంగాన్ని అప్పనంగా కట్టబెట్టేందుకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని ప్రజలకు పిలుపునిచ్చిన కూటమి ప్రభుత్వ నాయకులు అధికారం రాగానే వాటిని వేగంగా బిగించేందుకు చర్యలు చేపట్టడం సిగ్గుపడాల్సిన చర్య అని అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత విద్యుత్తు పంపిణీ ప్రభుత్వ ఆధీనంలో లేకుండా పూర్తిగా ప్రైవేటు కంపెనీల అజమాయిషి లోకి వెళుతుందని అన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలు ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో మరో విద్యుత్ ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున వామపక్షాల నిర్వహించడం జరుగుతుందని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి వాటిని మూకుమ్మడిగా వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, కార్యదర్శివర్గ సభ్యులు పి.సూర్యనారాయణ, వామపక్ష పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముర్రు పాలు బిడ్డకు శ్రీరామరక్ష : సూపర్‌వైజర్ తేజస్విని




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం గుండె మడగల ఎస్సీ కాలనీలో, పంచాయతీ పరిధిలోని చౌటపల్లి గుండె మడగల మెయిన్ అంగన్వాడీ కేంద్ర పరిధిలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి సూపర్వైజర్ తేజస్విని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది తల్లిపాలకు మద్దతునిచ్చే స్థిరమైన వ్యవస్థలను ఏర్పాటు చేసి తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యతనిద్దాం అనే నినాదంతో ప్రపంచ తల్లిపాల వారోత్సవంను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తల్లి ముర్రుపాలు బిడ్డలకు చాలా శక్తివంతమైనదని అంతేకాకుండా రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే అరగంట లోపల తల్లిపాలు ఇవ్వాలని తెలిపారు తల్లి ముర్రు పాలు ఇవ్వడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ ప్రమాద స్థాయి తగ్గిస్తుందని గర్భాశయం అండాశయంలో క్యాన్సర్ను నిరోధిస్తుందని కణజాలంలో ఈస్ట్రోజెన్ తక్కువగా ఉత్పత్తి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ముర్రుపాలు బిడ్డకు తాపించడం వల్ల తల్లి బిడ్డకు ఎముకల వ్యాధి నియంత్రణకు దోహదపడతాయని తెలిపారు నవజాత శిశువు జన్మించిన తర్వాత తల్లికి వచ్చే ముర్రుపాలు బిడ్డకు తప్పక తాగించాలన్నారు. అందులో ఎన్నో పోషకాలు విటమిన్లు ఉంటాయని పిల్లల ఎదుగుదలకు తల్లిపాలు శ్రేష్టమని తెలిపారు చిన్నారుల్లో రోగనిరోధక శక్తిని పెంచే గుణం తల్లిపాలలో ఉందన్నారు ఊబకాయం కూడా నిరోధించడమే కాకుండా మెదడు చురుకుగా పనిచేసే విధంగా తల్లిపాలు దోహదపడతాయని తెలిపారు బిడ్డకు తల్లిపాలు ఆరోగ్యప్రదాయంగా పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రాధా ప్రకృతి శ్రీదేవి, తల్లులు చిన్నారులు తదితరులు ఉన్నారు.

## సీపీఎం ఆధ్వర్యంలో నందవరం వద్ద నిరసన



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని నందవరం సబ్ స్టేషన్ వద్ద సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయకూడదు అనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం తగు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్య ప్రతినిధిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు మూలివెంగయ్య, మర్రిపాడు సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌డి రహమతుల్లా, నందవరం సీనియర్ నాయకులు ఎస్కే మహమ్మద్ గౌస్, కార్యదర్శి షాహిద్, మండల కమిటీ సభ్యులు బి.సుధాకర్, రామనాయుడు పల్లి కార్యదర్శి పంగా సుబ్బారావు, బాబా కరిముల్లా, టైలర్ మస్తాన్ మిగతా సానుభూతిపరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** దుత్తలూరు మండలం కట్టకిందపల్లి గ్రామంకు చెందిన వేమూరి రామ బ్రహ్మానందం వెంకటరత్నమ్మ కుమార్తె నాగజ్యోతి వివాహ వేడుకలు వింజమూరు ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో అంగ రంగ వైభవంగా జరిగాయి. ఈ వివాహ వేడుకకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులైన నాగజ్యోతి వినోద్‌కుమార్ దంపతులను మంగళాక్షితలు వేసి ఆశీర్వదించారు. వివాహజీవితం నిండునూరేళ్ల చల్లగా ఉండాలని ఆశీర్వదించారు.

## గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాలలో సంగం సర్కిల్ సీఐ వేమారెడ్డి సోమవారం విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా ఆకతాయిలు వెంటపడి వేధిస్తే వెంటనే ఆ సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని బాలికలకు సూచించారు. బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కే.సాలమ్మ, అధ్యాపకులు సందాని ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కనుపూరులో తల్లిపాలపై అవగాహన



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలంలోని కనుపూరు పంచాయతీలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు అవగాహన కార్యక్రమం జరిగింది. పుట్టిన వెంటనే తల్లిపాలను అందించడం, ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. తల్లి తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, కుటుంబ నియంత్రణ పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో ఐసిడిపిఒ విజయలక్ష్మి, సూపర్వైజర్ భాగ్యమ్మ, ఏఎన్ఎం రమాదేవి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

## జేసీకి వైసీపీ నేతల విజ్ఞప్తి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో సమయానికి వర్షాలు కురిసి రైతులు పంటలు బాగా పండించుకుంటూ ప్రభుత్వం నుంచి రైతులు అందిస్తున్న సహకారంతో అనుకున్న సమయానికి రైతులకు విత్తనాలు, ఎరువులు అందిస్తూ.. ఎలాంటి విద్యుత్ అంతరాయాలు లేకుండా పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులు ఎంతో సుభిక్షంగా ఉండేందుకు దోహదపడిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడిన 2014–19 ఐదేళ్ల కాలంలో వర్షాలు లేక రైతులు భూములను అమ్ముకొన్న పరిస్థితులు మనందరం చూశామన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గాలికి వదిలేసి ప్రతిపక్ష వైఎస్ఆర్సిపి పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడం, వారిని ఏవిధంగా ఇబ్బంది పెట్టాలో అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ రాక్షస పాలన సాగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20 వేల రూపాయలు అందిస్తామని చెప్పి.. గత ఏడాది రైతులను కుటమి ప్రభుత్వం దగా చేశారని మండిపడ్డారు. గత ఏడాది అన్నదాత సుఖీభవ కింద 20 వేలు ఈ ఏడాది మరో 20 వేలు మొత్తం 40 వేల రూపాయలు అందించాల్సి ఉండగా, టీడీపీ ప్రభుత్వం 7 వేల మంది రైతులకు కోత విధించి కేవలం రైతులకు 5 వేల రూపాయలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా కింద ఏడాదికి 12,500 రూపాయలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అంతకుమిన్నగా 13,500 రూపాయలు అందించడం జరిగిందన్నారు. ఇలా 53.58 లక్షల మందికి రైతు భరోసా కింద జగన్మోహన్ రెడ్డి 13,500 రూపాయలు అందించడం జరిగిందన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు విత్తనాలు పురుగుమందులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులకు సకాలంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందజేసేందుకు వైయస్ జగన్మోహన్ రెడ్డి 10,778 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరును మార్పు చేసి వాటిని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఎరువులు, పురుగు మందులు, సబ్సిడీ ధరలకు అందించాల్సిన ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ రైతుసేవ కేంద్రాల ద్వారా ఎక్కువ ధరకు అమ్ముకుంటూ కూటమి ప్రభుత్వ నేతలు తమ కనుసనల్లో వాటిని పెట్టుకుని బ్లాక్ మార్కెట్ ద్వారా బస్తాకు 200 నుంచి 500 రూపాలయ వరకు అధిక ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు లబ్ధి పొందేందుకే కూటమి ప్రభుత్వం ఈ విధమైన దుర్మార్గ పోకడలను అవలంభిస్తుందని మండిపడ్డారు. రైతులు ఒక బస్తాకు 300 నుంచి 600 రూపాయలు అదనంగా వెచ్చిస్తూ పురుగుమందులు, ఎరువులు బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎరువులు కోసం నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలో గంటలుకొద్ది రైతులు క్యూలైన్‌లలో నిల్చోవడం దుర్భర పరిస్థితి చోటు చేసుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎప్పుడైనా రైతులు ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నది చూసి ఉంటామా చెప్పాలన్నారు. ఇటీవల ఇలాంటి పరిస్థితి శ్రీకాకుళం జిల్లాలో చోటు చేసుకుందని 440 బస్తాలు ఎరువులు వస్తున్నాయని తెలిసి 1300 మంది రైతుల గంటలు కొద్ది క్యూలైన్‌లలో వేచి ఉంటే.. ఒక్క బస్తా కూడా రైతులకు ఇచ్చింది లేదన్నారు. అక్కడికి వచ్చిన తెలుగు దేశం పార్టీ నాయకుడు బస్తాలను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే అక్కడున్న రైతులు అడ్డుకున్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందేనన్నారు. అలాగే జూలై 14న కర్నూల్లో యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో వేచి ఉంటే ఒక బస్తా కూడా వారికి అందించింది లేదన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతి జిల్లాలో రైతులు వారి ఇబ్బందులు చెప్పుకునేందుకు రోడ్ల మీదకు వచ్చి ధర్నా చేయాల్సిన పరిస్థితి తలెత్తుతున్నాయన్నారు. మరోపక్క పండిన పంటను అమ్ముకునేందుకు కూడా రైతులకు అవకాశం లేకుండా పోయిందన్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వార రైతుల పంటను అమ్మించే వరకు రైతు భరోసా కేంద్రాలు బాధ్యత తీసుకున్నాయన్నారు. ఈరోజు ఆ పరిస్థితి లేదన్నారు. వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో మామిడి కాయలు కిలో 22 నుంచి 29 రూపాయలు అమ్ముకుంటూ రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని, ఈరోజు కేజీ మామిడి పండ్లు 2 రూపాయల ధర పలుకుతుండడంతో రైతులు వాటిని రోడ్ల మీదకు తెచ్చి పారబోసే పరిస్థితి వచ్చిందన్నారు. అదేవిధంగా ధాన్యం విషయానికి వస్తే.. తరుగంటూ, అవంటూ ఇవంటూ బస్తా మీద 300 నుంచి 400 రూపాయలను రైతులు నష్టపోయిన పరిస్థితిని గత సంవత్సరంలో మనం చూశామన్నారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి నెలకొందన్నారు. కోకో పంటకు సంబంధించి కేజీ పంటను 550 రూపాయలు మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పి ఈరోజుకీ ఒక కేజీ కూడా కొనుగోలు చేయని పరిస్థితిని మనం చూస్తున్నామన్నారు. ఆక్వా రైతులు కూడా 200 నుంచి 210 రూపాయలకు అమ్ముతామన్న సరే ఎవరు కొనే పరిస్థితుల్లో లేరన్నారు. మిర్చి విషయానికొస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 27 వేల రూపాయలకి అమ్ముకుంటుండగా ఈరోజు 8 వేల నుంచి 10 వేల రూపాయలకు కూడా మిర్చిని అమ్ముకోలేని పరిస్థితిలో రైతులు ఉన్నారన్నారు. టమోటా విషయానికి వస్తే 15 కిలోల బాక్స్ 50 రూపాయలకు కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని గత ప్రభుత్వంలో పంటల ఇన్సూరెన్స్ విషయంలో ఒక రూపాయి కూడా రైతులు వద్ద నుంచి వసూలు చేయకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తూ పంట నష్టం జరిగితే సకాలంలో బీమా అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతులకు ఇన్సూరెన్స్ లేదు.. ఇన్పుట్ సబ్సిడీ కూడా అందడం లేదని, గతంలో రైతులకు సున్నా వడ్డీ రుణాలు ఉండేవని, ఇప్పుడు ప్రభుత్వం ఆ సున్నా వడ్డీ రుణాలు కూడా ఎత్తేసిందన్నారు. రైతులు ఐదు రూపాయలు, పది రూపాయల వడ్డీకి అప్పు తెచ్చుకొని పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. గత 15 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు ఎరువులు, యూరియ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అలాగే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్ఆర్సిపి డిమాండ్ చేస్తుందన్నారు. ఇటీవల రాష్ట్రంలో 250 మంది రైతుల మరణాలు సంభవించాయని అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రతి జిల్లాలో రైతులు ఆత్మహత్యలు చోటు చేసుకునే పరిస్థితి వచ్చింది అన్నారు. అయితే ప్రభుత్వం 60 మంది రైతులు మాత్రమే మరణించారని అబద్ధపు లెక్కలు ప్రచారం చేస్తుందన్నారు. కనీసం ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం 60 మంది రైతు కుటుంబాలకు నష్టపరిహారం అందించారా చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న రైతులు ఒక్కరికి కూడా ఒక్క రూపాయి కూడా అందించింది లేదన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతులకు ఎరువులు పురుగుమందులు సకాలంలో అందించాలని బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరీగా మురళి, రూరల్ సమన్వయకర్త అన్న విజయకుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పూజిత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ కేడట్లకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌదంగవే ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ వెంగళరావు నగర్‌లో సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో వంద మంది ఎన్‌సీసీ కేడట్లకు, వంద మంది పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ నెల్లూరు జిల్లా కన్వీనర్ సిహెచ్ అజయ్ బాబు సహకారంతో, బ్లడ్ మోటివేటర్ మధుసూదన్ రావు సౌజన్యంతో రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి కేడట్లకు వారి వారి రక్త గ్రూపులను తెలియజేశారు. అనంతరం ఎన్‌సీసీ కేడట్లను ఉద్దేశించి గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ.. బాల్యం నుంచే ప్రతి ఒక్కరికి రక్త గ్రూపులకు సంబంధించి అవగాహన అవసరమని, అందుకే ఎన్‌సీసీ కేడట్లకు పాఠశాల విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వారికి రక్తదానం యొక్క ఆవశ్యకత గురించి, రక్తదానం చేయవలసినటువంటి ప్రాధాన్యతను గురించి ఎవరైనా ఎప్పుడైనా ఎక్కడైనా ప్రమాదానికి గురైనప్పుడు సకాలంలో వారికి రక్తాన్ని ఎక్కించాల్సిన సందర్భంలో వైద్యులు వారి గ్రూపు గురించి అడగడం జరుగుతుందని, వారి రక్త గ్రూపు తెలిసినప్పుడు వైద్యులు సకాలంలో ఆ రక్తాన్ని ఎక్కించి వారిని కాపాడడానికి వీలవుతుందన్నారు. ప్రమాదానికి గురైన వారి రక్త గ్రూపు తెలియకపోతే వారికి రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఎక్కించే క్రమంలో ఆలస్యమై ఒక్కోసారి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. అందువలన ప్రతి విద్యార్థి బాల్య దశ నుంచే రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేయించు కుని, వారి రక్త గ్రూప్‌ని తెలుసుకుంటే ప్రాణాపాయ స్థితి నుంచి ప్రమాదాలు సంభవించిన పరిస్థితుల్లో బయటపడవచ్చు న్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ప్రతి మూడు మాసాలకు ఒక పర్యాయం




రక్తదానాన్ని చేయవచ్చని, రక్తదానం చేయడం వల్ల మరింత ఆరోగ్యవంతులుగా కావచ్చున్నారు. రక్తదానం ప్రాణదానమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు గ్రామీణ మండల విద్యాశాఖ అధికారి మురళీధర్ విచ్చేసి గుండాల నరేంద్రబాబు చేస్తున్న సేవలకు గుర్తించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు భూషణ్ కుమార్‌ను రెడ్ క్రాస్ బ్లడ్ మోటివేటర్ మధుసూదన్ రావు శాలువాతో సత్కరించారు. టెక్నీషియన్ సంజయ్ క్యాడేట్లకు రక్త గ్రూపు పరీక్షలను నిర్వహించారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పెంచలయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కేడట్లు పాల్గొన్నారు.

# బిడ్డలకు పరమశ్రేష్టం తల్లిముర్రుపాలు : సీడీపీఓ



**సంగం/ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బిడ్డలకు తల్లిపాలు అత్యంత శ్రేష్టమని, ముర్రుపాలు పరమశ్రేష్టమని, అత్యంత ప్రయోజనకరమని, వ్యాధి నిరోధకశక్తిని పెంపొందిస్తాయని సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. తల్లి పాలవారోత్సవాల్లో భాగంగా సంగం మండలం నిమ్మతోపు సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె అతిధిగా పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిడిపివో సునీలత ప్రసంగిస్తూ తల్లిపాలు బిడ్డలకు అత్యంత ఆరోగ్యకమని, రోగనిరోధకశక్తిని పెంపొందిస్తాయని, మహిళలందరూ ప్రధానంగా గర్భిణీలు, బాలింతలు ఈ విషయాన్ని గమనించాలని, అవగాహన పెంపొందించుకోవాలని, తగిన చైతన్యం పొందాలని ఆమె సూచించారు. ప్రతిఏటాలాగే ఈదపా కూడా జిల్లా ఐసిడిఎస్ పిడి ఆదేశాల మేరకు అందరికీ తల్లిపాల ప్రాధాన్యతను గురించి అవగాహన పెంపొందించేలా తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను తమ ప్రాజెక్టు పరిధిలోని వాడవాడలా నిర్వహిస్తున్నామన్నారు. బిడ్డపుట్టిన వెంటనే గంటలోపు తల్లి ముర్రుపాల ను బిడ్డలకు ఇస్తే ఎంతో ప్రయోజ నకరమని, రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన బిడ్డ లకు ఆరునెలల వరకు తల్లిపాలనే ఇస్తే అత్యంత శ్రేష్టం, ఆరోగ్యవంతమని సునీలత పేర్కొన్నారు. తల్లి గర్భిణీసమయంలో తగినంతగా పోషక విలువల ఆహారం తీసుకుంటే బిడ్డలకు సమృద్ధిగా పాలు లభిస్తాయని పేర్కొ న్నారు. తల్లిపాలు బిడ్డలకు అమృతం లాంటివని కూడా ఆమె పేర్కొన్నారు. మహిళలందరూ తప్పకుండా తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి అవగాహన పెంపొందించుకోవాలని, తప్పకుండా పాటించాలని సునీలత కోరారు. తల్లిపాల ప్రాధాన్యత, ఆవశ్యకతలగురించి సూపర్‌వైజర్ రమాదేవి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# జలజీవన్‌మిషన్ పధకం ట్యాంకుల ఏర్పాటుకు స్థలపరిశీలన





### కరటంపాడుకు 205.5లక్షల నిధులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం కరటంపాడు పంచాయతీకి త్రాగునీటి పధకాలకోసం జలజీవన్‌మిషన్ ద్వారా 205.5లక్షల రూపాయలు మంజూరయ్యాయి. కరటంపాడు గ్రామానికి 88.60లక్షలు, గిరిజనకాలనీకి 58.60లక్షలు, సాతానుపల్లికి 58.30 లక్షల రూపాయలు మంజూరు కాగా ఈ నిధులతో ఓవర్‌హెడ్‌ట్యాంకులు నిర్మాణానికిగాను 3చోట్ల సోమవారం నాయకులు, అధికారులు స్థలపరిశీలన గావించారు. సర్పంచ్ పూనుగుంట రేవతి, మాజీ ఉపమండలాధ్యక్షుడు, గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్, సామాజికసేవాప్రదాత, బట్టేపాడు పిఏసిఎస్ డైరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, రాష్ట్ర తెలుగుదేశం నాయకుడు, సర్వేపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పరిశీలకులు దావా పెంచలరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈఈ బి.మోహన్‌రావు, ఏఈ సుదర్శనబాబు, తదితరులు కరటంపాడు మెయిన్, గిరిజనకాలనీ, మజరా సాతానుపల్లిలలో పర్యటించారు. ట్యాంకుల నిర్మాణానికి అనువైన స్థలాల కోసం వారు పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా గార్లపాటి, దావాలు మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషితో తమ పంచాయతీకి త్రాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు 205.5లక్షల రూపాయలను మంజూరు చేయించారని, మంత్రి ఆనంకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ హరి, కాంట్రాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ముందుకుసాగని గృహనిర్మాణం

### 14.7శాతం మాత్రమే నిర్మాణాలుపూర్తి : ప్రారంభంకానివి 209

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలో ఏడాదికాలంగా మంజూరైన పక్కాగృహాల నిర్మాణం పరిస్థితి చూస్తుంటే ఏమాత్రం ముందుకు సాగడం లేదు. మండలంలో ఈనెల 22వ తేదీనాటికి పరిశీలిస్తే కేవలం 14.7శాతం గృహాలు మాత్రమే పూర్తికాగా 209 గృహాల పనులు ప్రారంభం కాకపోగా 363గృహాలు పునాదులకే పరిమితమై ఉన్నాయి. నుడా, పిఎంఏవై పథకాల ద్వారా ఆత్మకూరు మండలానికి 2024-25 ఆర్థికసంవత్సరంకుగాను 793 గృహాలు ప్రభుత్వం నుండి మంజూరయ్యాయి. అందులో 117గృహాల నిర్మాణాలు పూర్తికాగా 209 నిర్మాణాలు ప్రారంభం కాలేదు. 363గృహాలు పునాదులకన్నా తక్కువలో నిలిచిపోయి ఉన్నాయి. 37గృహాలు పునాదుల స్థాయిలో, 11గృహాలు లింటిల్‌లెవల్‌లో, 24గృహాలు రూఫ్‌లెవల్‌లో, 32గృహాలు శ్లాబ్‌లెవల్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఒక్కో గృహానికి 1.75లక్షల రూపాయలు వంతున మంజూరు చేస్తుండగా ఇటీవల అదనంగా బిసిలు, ఎస్‌సిలకు 50వేలరూపాయలు, ఎస్‌టిలకు 70వేల రూపాయల వంతున మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయినా గృహనిర్మాణంలో పురోగతి అత్యంత నీరసంగా కన్పిస్తోంది. కాగా మండలంలో గృహాలు మంజూరు చేయాలంటూ ఆన్‌లైన్‌లో 919మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో 595మందిమాత్రమే తగిన డాక్యుమెంట్లు జతపరచగా మిగతావారు జతపరచలేదు. మండలంలోని అప్పారావుపాళెంలో ఆరుగృహాలకుగాను 2పూర్తయ్యాయి. ఆరవేడులో 1గృహంకాగా అది పూర్తయింది. బండారుపల్లిలో 26కుగాను ఒక్కటికూడా పూర్తికాలేదు. బట్టేపాడులో 34గృమాలకుగాను 3పూర్తయ్యాయి. బోయలచిరువెళ్ళలో 55గృహాలకుగాను 9పూర్తయ్యాయి. చెర్లోయడవల్లిలో 45గృహాలకుగాను 10పూర్తయ్యాయి. దేపూరులో 2ఇళ్ళకుగాను ఒక్కటికూడా పూర్తికాలేదు. కరటంపాడులో 59గృహాలకుగాను 3పూర్తయ్యాయి. మహిమలూరులో 165 గృహాలకు గాను 15పూర్తయ్యాయి. మురుగుళ్ళలో 21గృహాలకుగాను నాలుగు పూర్తికాగా నాగులపాడులో నాలుగు గృహాలకుగాను ఒక్కటి కూడా పూర్తికాలేదు. నల్లపురెడ్డిపల్లిలో 7గృహాలకుగాను ఐదు పూర్తయ్యాయి. నారంపేటలో 8గృహాలకుగాను ఒక్కటి కూడా పూర్తికాలేదు. నువ్వురుపాడులో 8గృహాలకుగాను నాలుగు పూర్తయ్యాయి. పడకండ్లలో 23 ఇళ్ళకుగాను 8పూర్తికాగా పమిడిపాడులో 4ఇళ్ళకుగాను నాలుగు పూర్తికాగా రామస్వామిపల్లిలో 17కుగాను ఒక్కటి, రావులకొల్లులో 3కుగాను 3, వాసిలిలో 76కుగాను 18, వెన్నవాడలో 5కుగాను 3పూర్తయ్యాయి. అర్హులందరికీ అవసరమైనన్ని గృహాలు మంజూరుచేయించేందుకు ఆత్మకూరు అభివృద్ధిప్రదాత, రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సిద్ధంగా ఉండగా గృహాలను వెంటనే ప్రారంభించి పనులు పూర్తిచేయాలని పదేపదే అధికారులు కోరుతున్నా ఆత్మకూరు మండలంలో గృహనిర్మాణం అత్యంత నత్తనడకన సాగుతోంది. మరి పురోగతి లభిస్తుందో లేదో చూడాల్సి ఉంది.

## ఆత్మకూరులో రెండు ఆధార్‌నమోదు కేంద్రాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కమీషనర్ సి,గంగాప్రసాద్ ప్రత్యేక కృషితో ఆత్మకూరు పట్టణానికి రెండు ఆధార్‌నమోదు కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో ఒక ఆధార్‌కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. మరో ఆధార్‌నమోదు కేంద్రాన్ని స్థానిక ఎంపిడివో కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. ఆత్మకూరులో ఆధార్‌నమోదు కేంద్రాలు లేక నూతన నమోదు, సవరణలకు జనాలు అనంతసాగరం మండలం రేవూరు, వింజమూరు మండలం గుండెమడకల గ్రామాలకు వెళుతూ తీవ్రంగా ఇబ్బందిపడుతుండేవారు. ఆధార్‌నమోదు కేంద్రం లేక అవస్థలుగా ఉండగా పరిస్థితిని గమనించిన మున్సిపల్ కమీషనర్ దృష్టిసారించి ప్రత్యేకశ్రద్ధతో యత్నించి పట్టణంలో రెండు ఆధార్‌కేంద్రాలను ఏర్పాటుకు దోహదపడ్డారు. దాంతో ప్రజలు సంతోషపడుతూ కమీషనర్ గంగాప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వమిచ్చిన ఫోన్‌లను.. వాపసుచేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన మొబైల్‌ఫోన్‌లు పనిచేయడం లేదంటూ సోమవారం వారు ఆత్మకూరులోని సిడిపివో కార్యాలయంలో స్వాధీనం చేశారు. ఆత్మకూరు ప్రాజెక్టుపరిధిలోని ఆత్మకూరు మున్సిపాలిటీ, ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాల్లో 255 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు సిఐటియు జిల్లా నాయకుడు జివి శివప్రసాద్ పాల్గొనగా సెల్‌ఫోన్‌లను వాపసుచేసి నిరసన తెలిపారు. సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ ప్రధానకార్యదర్శి పి.రాధ ఆధ్వర్యంలో ఫోన్‌లను వాపసు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టుకమిటీ నాయకులు, సెక్టార్‌లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్యాకేజీ ఇవ్వాలంటూ ఆందోళన



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అసంపూర్తిగా మిగిలి ఉన్న నాన్ ఫిషర్మెన్ ప్యాకేజీని పంపిణీ చేయాలని సిపిఎం పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు నేతృత్వం వహించారు. ప్రజా విజ్ఞప్తుల దినం కార్యక్రమంలో తహసిల్దార్ స్వప్నకు వినతి పత్రాన్ని అందజేశారు. కృష్ణపట్నం పోర్టు బైపాస్ రోడ్డు మార్గంలో పంటపాలెం సమీపాన ఆయిల్ ఉత్పత్తి కర్మాగారాల వల్ల వస్తున్న పోలీసులు కారణంగా రెండు గ్రామాలు ప్రజలకు పొల్యూటర్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ప్రజలకు పరిశ్రమలకు మధ్య ఒప్పందం కుదిరి ఉందని రికార్డు పరంగా తహసిల్దార్‌కు తెలియజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని తాసిల్దార్ హామీ ఇచ్చారు.

# సర్వేపల్లి ఏఎంసీ పాలకవర్గ బాధ్యతల స్వీకరణ




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. వెంకటాచలం మండలంలోని ఏఎంసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గాలి రామకృష్ణారెడ్డి చైర్మన్‌గా, అరుణమ్మ వైస్ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ,రైతుల పంటలకు నిల్వ సౌకర్యం కల్పించేందుకు గోదాముల నిర్మాణానికి ఏఎంసీ కృషి చేయనున్నట్లు వెల్లడించారు. గత ఏడాది సర్వేపల్లి ఏఎంసీకి సెస్ వసూలు ద్వారా రూ.2.30 కోట్లు ఆదాయం వచ్చిందని, అయితే లక్ష ఎకరాల్లో సగటున 4 లక్షల పుట్ల ధాన్యం దిగుబడి వస్తే సుమారు రూ.15 కోట్లకు పైగా ఆదాయం రావాల్సిందని తెలిపారు. కానీ 2021-23 కాలంలో రూ.1.61 కోట్లు, 2023-24లో రూ.1.84 కోట్లు మాత్రమే ఆదాయం రాగా, ఇది ఆశించిన స్థాయికి తక్కువేనన్నారు. ఏఎంసీలో ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు ఇద్దరే ఉన్నారని, 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 10 మంది ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారని వివరించారు. సిబ్బంది కొరతను తొలగించి ఏఎంసీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సర్వేపల్లిలో రూ.2.70 కోట్ల అంచనాతో పలు అభివృద్ధి పనులను ప్రతిపాదించామని తెలిపారు. 2014-19 మధ్య వరి సాగు చేస్తున్న రైతులకు ఆదాయం చాలా తక్కువగా ఉందని, ఎంతో కష్టపడి సాగు చేసినా వారికి రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు మాత్రమే లాభం లభిస్తోందని పేర్కొన్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువ మంది రైతులే ఉండటం ఆందోళన కలిగించే విషయం అని వ్యాఖ్యానించారు. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు.




సూర్య

## విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

**కావలసిన సెంటర్లు**

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

**నేటి దినపత్రిక సూర్య కార్యాలయం**
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

**9000118811, 9000483583**


## వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తాడేపల్లిలో వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఆయన నివాసంలో మధ్యాహ్నం 4 గంటలకు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం కలిశారు. ఇందుకు సంబంధించి జిల్లాలో పరిస్థితులు ఇటీవల నెల్లూరులో జరిగిన జగన్మోహన్‌రెడ్డి పర్యటన తదితర విషయాలను గురించి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అడిగినప్పుడు 11 నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సమిష్టి కృషితో కార్యక్రమం విజయవంతం అయిందని చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఆంక్షలు విధించి జనాలు రాకుండా రోడ్లు తవ్వించినప్పటికీ 25వేల మందికి పైగా ప్రజలు హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారని తెలిపారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాకు రావడం పట్ల కార్యకర్తలందరూ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారన్న విషయాన్ని తెలియజేశారు. అనంతరం పార్టీ పటిష్టత గురించి వైయస్ జగన్మోహన్ రెడ్డి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇప్పటికే జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం అయిందని జగన్మోహన్ రెడ్డి పట్ల ఆదరణ ప్రతి ఒక్కరిలో ఉందని చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ సమన్వయకర్తల సమిష్టి కృషితో జిల్లాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని చంద్రశేఖర్ రెడ్డి అధినేతకు వివరించారు.

## ఒరిగిన స్తంభం ప్రమాదానికి చిహ్నం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** విద్యుత్ సరఫరా జరిగే స్తంభాలు ఒరిగిపోయినట్లయితే దానివల్ల మిగిలిన స్తంభాలు కూడా ప్రమాదాన్ని గురయ్యే అవకాశం ఉంది స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే విద్యుత్ సరఫరా లైన్‌లో రెండు మూడు స్తంభాలు ఒరిగి ఉన్నాయి. ఒక స్తంభం పూర్తిస్థాయిలో ఎప్పుడెప్పుడు పడదామా అంటూ ఒరిగిపోయి ఉంది. ఆ స్థంభం పడినట్లయితే మిగిలిన స్తంభాలు కూడా పడిపోయే ప్రమాదం ఉంది. దానివల్ల ఇబ్బందులు జరిగే అవకాశం ఉంటుంది. కావున ట్రాన్స్‌కో అధికారులు ఒకసారి ఆ విద్యుత్ స్తంభాలను పరిశీలించి సరి చేయవలసిన అవసరం ఉంది లేనియెడల ప్రమాదం జరిగిన తర్వాత ఎంత ఆలోచించినా ఏమి ప్రయోజనం ఉండదు జాగ్రత్తలో భాగంగా ఆ స్తంభాన్ని సరిచేసి మిగిలిన స్తంభాలు కూడా గట్టిగా ఉండేలా చూడాలని పలువురు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రారంభమైన శ్రీవారి పవిత్రోత్సవాలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుండి శ్రీవారికి పవిత్ర ఉత్సవాలు ప్రారంభ మైయ్యాయి. మంగళ వారం శ్రీవారు యాగశాల ప్రవేశం సందర్భరా సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీవారి యాగ బేరమునకు (యాగ ఉత్సవమూర్తి) పంచ కలశ స్నపనం జరిగింది. సాయంత్రం 6గంటల నుండి పవిత్ర ఉత్సవ విజ్ఞపణం, విశ్వక్సెనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాసనం, రక్షాబంధనం, మృత్సమ్ గ్రహణం, యాగశాల వాస్తు పూజ, పాలిక స్థాపన, అఖండ దీప స్థాపనం జరిగాయి. శ్రీవారి పవిత్రోత్సవంలో భాగంగా శ్రీ వారి యాగ మూర్తికి పంచకలశ స్నపన తిరుమంజనం జరిగింది.

# ఎస్పీ పిజిఆర్ఎస్‌కు 84 ఫిర్యాదులు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో అడిషనల్ ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 84 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఆమె తెలియజేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదు లపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కరించాలని పోలీస్ అధికారులను అడిషనల్ ఎస్పీ ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నెల్లూరు టౌన్ డిఎస్పి సింధు ప్రియా, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి కె.సిహెచ్ రామారావు, లీగల్ అడ్వైజర్ టీ.శ్రీనివాసులు రెడ్డి, ఎస్బి-2 సీఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

### వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- కావలి పరిధికి చెందినటువంటి వ్యక్తిని, కోవూరు పరిధికి చెందిన ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి తన ఇంటి మీద సోలార్ ప్యానల్స్ బిగిస్తానని నమ్మించి 2,46,000/- నగదు తీసుకొని సోలార్ ప్యానల్స్ బిగించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నాడని, నగదు అడిగితే బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- మర్రిపాడు పరిధికి చెందిన వ్యక్తిని, వింజమూరు పరిధికి చెందిన మహిళను కలువాయి పరిధికి చెందిన సంధ్య అనే మహిళ సాఫ్ట్వేర్ జాబులు ఇస్తానని నమ్మించి, ఇద్దరి వద్ద కలిపి ఐదు లక్షల రూపాయలు నగదు తీసుకొని జాబులు ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు, నగదు అడిగితే బెదిరిస్తున్నట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు.
- వెంకటాచలం పరిధికి చెందినటువంటి రైతులను, దళారి ముని కృష్ణయ్య 29 లక్షలు విలువ గల పంటను లారీల్లో తీసుకెళ్లినట్లు, రావాల్సిన బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేస్తున్నట్లు, విచారించి న్యాయం చేయాలని కోరారు.
- సంగం పరిధిలోని మామిడి తోట యజమాని యూసఫ్ అనే వ్యక్తి, తన మామిడి తోటలో కాపలాదారుగా ఉన్నటువంటి మహిళను వెంటపడుతూ, డబ్బు బంగారం ఆశ చూపిస్తూ వేధిస్తున్నట్లు, అదేవిధంగా తన స్నేహితులతో కలిసి బలత్కరించినట్లు, శారీరకంగా వేధించినట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు.
- నెల్లూరు రూరల్ పరిధికి వృద్ధుడు లివర్ వ్యాధితో బాధపడుతున్నట్లు, తన కుమారుడు తనని బాగోగులు చూడడం లేదని, అవసరాల నిమిత్తం తన పొలం అమ్మగా వచ్చిన డబ్బులను ఇవ్వాలని తనని తన కుమార్తెను బెదిరిస్తున్నట్లు, తనని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు, అదేవిధంగా జలదంకి పరిధికి చెందినటువంటి వృద్ధుని తన కుమారుడు వెంకటేశ్వర రెడ్డి తన బాగోగులు చూసుకుంటానని తన మీద ఉన్న ఇల్లు పొలం తీసుకున్నాడని, ప్రస్తుతం తనకి క్యాన్సర్ వచ్చిందని తెలిసి ఇంటి నుండి తరిమేసాడని, ప్రస్తుతం బాడుగ ఇంట్లో ఉన్నట్లు, వాళ్లు కూడా ఖాళీ చేయాలని చెప్పారని, దీన పరిస్థితుల్లో ఉన్నానని, తన కుమారుడు తన బాగోగులు చూసుకునేటట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు.
- కావలి పరిధికి చెందినటువంటి మహిళను భర్త, అత్తమామలు, మరిది అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని అదేవిధంగా సంతపేట పరిధికి చెందినటువంటి మహిళను భర్త చెడు అలవాట్లకు లోనై పుట్టింటి నుండి డబ్బులు తీసుకురావాలని వేధిస్తున్నాడని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ ఆనంద్**



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుటకు ఎవరికి కేటాయించిన విధులను ఆయా శాఖల అధికారులు భాధ్యతతో నిర్వహించాలన్నారు. అందరు అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలతోపాటు జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో పండుగ వాతావరణంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగేలా విద్యా శాఖాధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా నెల్లూరులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ ను శోభాయమానంగా అలంకరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థినీ విద్యార్థులచే నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకునే విధంగా ఉండేట్లుగా సంగీత కళాశాల, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన వినూత్నంగా ఉండేట్లుగాను, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల నమూనాలను ప్రదర్శించే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ హుస్సేన్ సాహెబ్, ఆర్డిఓ అనూష, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కర్షకుడే నిజమైన దేశ రక్షకుడు.. జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా



**మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రి**

**దుత్తలూరు/వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఆరుగాలం కష్టించి దేశానికి అన్నం పెట్టే అన్నదాతలకు అండగా నిలిస్తే అద్భుతాలు చేస్తారు. అందుకే కూటమి ప్రభుత్వంలో రైతులను రాజులుగా చూస్తున్న ప్రభుత్వం అని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నెల్లూరు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు సందర్భంగా ఆయన మాట్లాడుతూగత ప్రభుత్వంలో కష్టాలు, కన్నీళు ్లతో కాలం గడిపిన రైతులను ఎన్డీయే ప్రభుత్వం ఆదుకుంటోందని తెలియజేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం విత్తనాల పంపిణీ నుంచి పనిముట్ల వరకు పంపిణీ చేస్తూ వ్యవసాయంలో సాయంగా ఉంటోంది తెలియజేశారుఇప్పుడు అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సాయం కూడా అందిస్తోంది. రైతులకు ఉపయయోగపడే డ్రోన్లు, ఇతర వ్యవసాయ పనిముట్ల సబ్సిడీ రేట్లతో రైతు సోదరులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగంలో యాంత్రికరణ తీసుకువచ్చి రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న ప్రభుత్వానికి అండగా నిలుద్దామనమేకపాటి మాల్యాద్రి నాయుడు తెలియజేశారు.

# దేశ భద్రతను రాహుల్ గాంధీ రాజకీయంగా వాడుకోవడం సరికాదు

**▸ బీజేపీ జిల్లా నేత చిలక ప్రవీణ్**



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఒక బాధ్యతగల ప్రజాప్రతినిధిగా, భారత సుప్రీంకోర్టును ప్రశ్నించడం తగదు అని, భారత భూభాగాన్ని చైనా 2000 వేల కిలోమీటర్ల భూభాగాన్ని ఆక్రమించిందని నిరాధార ఆరోపణలు చేసిన రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు కొందరు నాయకులకు గుణపాఠంగా నిలవాలిని బిజెపి జిల్లా నేత చిలకా ప్రవీణ్ కుమార్ అన్నారు. 'నిజమైన భారతీయుడైతే అలా మాట్లాడరు' అని అత్యున్నత న్యాయస్థానం చెప్పిన మాటలు దేశాన్ని ప్రేమించే ప్రతి భారత పౌరుడి గుండెను తాకాయి. రాహుల్ గాంధీ లాంటి నేతలు దేశ భద్రత విషయాల్లో నిర్లక్ష్యంగా మాట్లాడడం మంచిదికాదు. చైనా దురాగతాలకు గట్టి జవాబు ఇచ్చిన నరేంద్ర మోదీ నేతృత్వంలో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం ఆ అంశాల్లో ఎప్పుడూ రాజీపడలేదు. కానీ కాంగ్రెస్ పార్టీకి మాత్రం చైనా పట్ల మక్కువ ఎక్కువ, భారత్ పట్ల విధేయత తక్కువగా కనిపిస్తోందన్నారు. రాజకీయ లాభాల కోసమే రాహుల్ గాంధీ ఇటువంటి చౌక వ్యాఖ్యలు చేయడం తగదు. ప్రజల నమ్మకాన్ని పొందాలంటే మోసపూరిత వ్యాఖ్యలు కాకుండా ప్రజల కోసం పని చేయాలి. సైన్యాన్ని తక్కువ చేసి మాట్లాడే నాయకుడికి దేశ ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

# స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన నెల్లూరు పోలీసులు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు, నెల్లూరు టౌన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది జిల్లా ఇన్చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్ అదేశాలతో అడిషనల్ ఎస్పీ సౌజన్య సూచనలతో టౌన్ డిఎస్పి హిందూ ప్రియ ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు వివిధ కూడళ్ళు, హైవే ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాలలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. లైసెన్స్ లేని, మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ వంటి వాటిని నిర్మూలించాలని వారు ట్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిటీ, డిఫెక్టివ్ నంబర్ ప్లేట్స్, మొదలైన ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారికి జరిమానాలు విధించారు. ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహణలో సుమారు 675 వాహనాలు తనిఖీ చేసినట్లు తెలియజేశారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ 8 కేసులు, అనధికార ఆరు వాహనాలను సీజ్ చేశారు.

# కుల దూషణ కేసులో ఆరు నెలల జైలు శిక్ష

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** రొయ్యల గుంటల అమ్మకానికి సంబంధించి పైకం ఇవ్వకుండా మోసం చేసి కులం పేరుతో తిట్టాడని నమోదైన కేసులో నిందితుడైన పెద్ద చెరుకూరు వాసి చిరమణ సతీష్ రెడ్డిపై ఆరోపణలు సాక్షాదారాలతో రుజువైనందున అతనికి ఆరు నెలల జైలు శిక్ష, 1000 రూపాయలు జరిమానా విధిస్తూ నెల్లూరు ఐదవ అదనపు జిల్లా జడ్జ్, ఎస్సీ ఎస్టీ కోర్టు కేసుల ప్రత్యేక జడ్జి ఎన్.సరస్వతి సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. నెల్లూరు రూరల్ మండలం పెద్ద చెరుకూరు గ్రామవాసి నిందితుడు చిరమణ సతీష్ రెడ్డికి తోటపల్లి గూడూరు మండలం కొత్తపాలెం గ్రామవాసి పొట్లూరు వెంకట శేషయ్య తన రొయ్యల సాగు పొలాన్ని విక్రయించారు. సతీష్‌రెడ్డి పొలం డబ్బులు ఇవ్వకుండా రెండు నెలలు తిప్పించుకుంటాడు. తరువాత ఫిర్యాదు వెంకట శేషయ్య తన డబ్బులు ఇవ్వమని నిలదీశాడు. దీనితో ఆగ్రహించిన నిందితుడు సతీష్ రెడ్డి ఫిర్యాదికి ఇవ్వాల్సిన పైకము ఇవ్వకుండా మోసం చేసి, ఫిర్యాది వెంకట శేషయ్యను కులం పేరుతో దూషించాడు. దీనిపై పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ డిఎస్పి కేసును దర్యాప్తు చేసి నిందితుడుపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పీపీ అజయ్ ప్రేమ్ కుమార్ వాదించారు.